# సంక్రాంతి కానుక

అల్లంత దూరంలో కందిచేల గుబుర్లలోనుంచి హరిదాసు చిరతలు మోగినయ్యో లేదో, విడీ విడని పొగమంచులోనించి వాకిట్లో గుర్రబ్బండి ఘల్లుమని ఆగింది. బండి చక్రం అప్పుడే అమర్చిన తల్లి గొబ్బెమ్మమీద నించి పోనిచ్చినందుకు జట్కావాలా మీద చెల్లాయి కళ్లెర్రజేసేలోగా అక్కాయి బండిలోనించి దిగింది. చెల్లాయి ముఖం వికసించింది. కళ్ళల్లో నుంచి మంకెనలు దిగజారి మల్లెపువ్వులు మాలలు గట్టాయి. "అమ్మా, అమ్మా అక్కాయొచ్చిందేవ్!" అంటో యింట్లోకి పరుగెట్టింది.

ఇంట్లో చల్ల గిలకొడుతున్న రామాయమ్మ బైటకొచ్చింది. ముందు పెద్దమ్మాయీ, వెనకాల సూట్‌కేసూ రావడం గమనించింది. కాని ఆమె చూపు వెనకాతల బండిలో నుంచీ ఎవరైనా దిగబోతున్నారా అన్న దిలాసాలోనే నిలిచిపోయింది. మరెవ్వరూ దిగలేదు. ఉదయించీ వుదయించ గానే మబ్బుల్లో చిక్కుకున్న చంద్రబింబమయింది రామాయమ్మ మొహం.

"ఆయన రాలేదా అమ్మా!" అని తలనిమిరింది తల్లి.

"లే"దని తలూపింది సుశీల.

"మామూలేగా!" అని చప్పరించింది తల్లి.

"ఆయనకదో సరదా" వంటింట్లోకి దారితీస్తూ వ్యాఖ్యానిస్తోంది రామాయమ్మ.

"అందరి అల్లుళ్ళతోపాటు వస్తే ఆయన గొప్పేమున్నదిహ" అని కిలకిలా నవ్వింది సుశీల మొఖమల్ స్లిప్పర్లు విడుస్తో.

"మరీ రేపు పండుగనగా నిక్కచ్చిగా బయలుదేరి రావాలటే సుశీ? నేను చూస్తే ఒంటరి దానినాయెను..."

"అది కాదమ్మా. ఆయన బొంబాయి నుంచి వస్తారేమో, ఇద్దరమూ కలిసి వద్దామని యిన్నాళ్లూ రేపూ, మాపూ అని ఎదురు చూచి చూచి ఇక లాభంలేదని బయలుదేరాను చెప్పొద్దూ."

"ప్రతియేటా ఆయన కున్నదేగా అలవాటూ - ఇక వస్తాయిగా వుత్తరాలు, "నేను వస్తే చిన్న రవ్వల వుంగరం, రాలేకపోతే, నన్నూ భాయ్ జ్యూయలరీ నించీ కొత్తరకం నెక్లెస్" అని పూరిస్తో.

చెల్లాయి కలకండ అక్కాయి నింకా పలకరించనే లేదు. చాలా అర్జంటు పనిలో మునిగి పోయింది. అప్పుడే యిరుగు పొరుగిళ్లలో జొరబడి "మా అక్కాయొచ్చింది. మా అక్కాయి." అని దండోరావేసి అలిసిపోయి పులుసుకూరై పలకరించే దమ్మయినా లేక అక్కాయి చెయ్యిపట్టుకుని చక్కా వూరుకుంది. ఆ పిల్లకు యింట్లోకి వచ్చిపడిన ఆనందాన్ని గబగబా నలుగురికీ పంచేస్తేనేగాని తీరదు.

పుట్టింటి కొచ్చిన సువర్ణా, చంద్రకళా చదువుతున్న పత్రికలూ అల్లుతున్న లేసులూ వదిలేసి ఒక్కబిగిని వచ్చిపడ్డారు.

రామాయమ్మ ఇంకా కుశల ప్రశ్నలే ముగించలేదు. ఆడబిడ్డ ధీమాకీలూ, అత్తగారి ఆరళ్లూ ఇంకా ప్రసంగంలోకి రానేలేదు. గుచ్చి గుచ్చి ప్రశ్నలువేసి తేల్చుకోవల్సిన ఘటా లింకా మిగిలే వున్నాయి. అప్పుడే తుపాను వచ్చిపడింది ఇంట్లోకి.

మొహమట్లా వెలవెలబోతోందేమిటేవ్? నీళ్లోసుకుని ఎన్నాళ్లయిందీ?" అని వుపక్రమిం చింది చంద్రకళ.

"నీళ్లు రోజూ పోసుకుంటూనే"వున్నాగా వేడివేడివీ!" అని ఫక్కున నవ్వింది సుశీల.

"ఆ నీళ్ళు కాదో!" అని బుగ్గమీద పొడిచింది సువర్ణ.

ఇక లాభంలేదని పొయ్యి దగ్గర సతమతమవుతోంది రామాయమ్మ.

సుశీల పోపుల పెట్టె దగ్గరకు వెళ్ళుతుంటే సువర్ణ దిగింది. ఆపైన యింకా కొన్ని సీతాకోకచిలుకలు వాలినై. ఆ పూలరథమంతా కదిలింది. ఈ వీధి నుంచీ - ఆ వీధికి, ఈ ఇంటి నుంచి ఆ యింటికీ. పెరళ్లలో నుంచీ "ఎప్పుడేవ్" "మీ ఆయనొచ్చాడా!" "మళ్ళీ చంకన బరువు లేకుండానే వచ్చావూ!" అని పలకరింపులూ, ప్రశ్నల పరంపరలూ దొర్లిపోతున్నాయి.

సువర్ణ యింటి దగ్గర ఆగింది రథం. ఆవిడ పెనిమిటి వచ్చి పది రోజులయింది. ఈ గలభా చూసి ఆయన పుస్తకం మూసి ఇంట్లోనుంచీ బయటపడ్డాడు. "మీవారా!" అంది సుశీల ఆగి.

"గుర్తులేదాయేమే!" అన్నది సువర్ణ. అని వూరుకోక -

"చంద్రకళ మొగుడొచ్చి 15 రోజులయింది, అని కంగించింది. అందులో "రానిది నీ మొగుడే!" అని ధ్వనించింది సుశీలకు.

"ఇదుగో! ఈ గాజుల జత తీసుకొచ్చారు మావారు" అని చూపింది సువర్ణ. అంతా పరిశీలన చేశారు. రాళ్ళ తూకమూ, పనివాడితనమూ ఏదో సంసారపక్షంగా వున్నాయి. సువర్ణ

మొగుడు స్కూలు మేష్టరు.

"ధర ఎంతో!' అని ప్రశ్నించింది సుశీల తల వోరగా వంచి.

"అదిగో – దానికి ధర మీదనే దృష్టి!" అని అంటించింది చంద్రకళ. "ఏమో నాకు తెలియదు" అని తుంచేసింది సువర్ణ.

"అంటే ధర స్వల్పమన్న మాట. ఎక్కువలోదయితే ఫెడీమని చెప్పవూ!" అంది చంద్రకళ. "చవకబారుదే అనుకో పోనీ". ఇక్కడి వాతావరణం తన కెదురెత్తుగా నడుస్తోందని స్ఫురించింది సుశీలకు. "నేనేమన్నానే చందూ! వూరికే అడిగితేనూ" అని గద్దించింది.

"అవును వూరికేనే అడిగావులే పాపం – నంగనాచి తుంగబుర్ర. దాని మొగుడింకా నయం ఏదో చిన్న ప్రెజెంటు తీసుకొచ్చాడు. మా ఆయన తెచ్చేవి బంగారం కాదు. బండెడు పుస్తకాలూ, వంద చామంతి పువ్వులూ. నీపాటి ఎట్లా వస్తుందే మాకూ!" అని సుశీలవేపు హేళనగా తడుతూ, "మొగుడు రాకపోయినా మోజైన రాజా ప్రెజెంట్ కొడతావు నువ్వు!" అని కుండ బద్దలుకొట్టింది చంద్రకళ. చురుక్కుమన్నది సుశీలకు.

ఎండెక్కింది. ఈ పటాలమంతా ఎక్కడ మార్చింగ్‌లో వున్నదో అంతు దొరకలేదు రామాయమ్మకు. దొడ్లూ దోవలూ అన్నీ గాలించింది కలకండ. కొనకు ఆంజనేయస్వామి కోవెలలో కోనేటి గట్టుమీద వూకబంతిపువ్వులు వూరికే దూసేస్తూ దొరికారు ముగ్గురూ మూడు చురకత్తులల్లే. చెల్లాయి అక్కాయిని పట్టుకుని "అమ్మ రమ్మనమంది" అని లాక్కెళ్ళింది.

రామాయమ్మ మినప్పప్పు నానబోసింది. రుబ్బురోలు కడుగుతూ చిన్న నవ్వు నవ్వి "నీ పుణ్యం పుచ్చిందే సుశీ!" అన్నది సాభిప్రాయంగా. "అప్పుడే చెప్పనన్నావు గదుటే అమ్మా!" అని గునిసింది కలకండ. "క్యాబేజీ నేను తరుగుతా యిటుతేవే" అని చెల్లాయి చేతిలోనించీ లాక్కుని కత్తిపీట ముందువేసుకుంది సుశీల. అపురూపమైన వార్త ఏదో తనకు చెప్పకుండా కవ్విస్తున్నారని గ్రహించింది సుశీల. దానికల్లా ఒకటే మందు, అమెకు తెలీదాయేం. "తనకేమీ తెలుసుకోవాలనే ఆత్రమే లేనట్టు నటించాలంతే". "సరే అదేమిటో ఇద్దరూ వుమ్మడిగా దాచుకోండి" అనేసి నిర్లక్ష్యంగా జీడిపప్పు ఒలుస్తోంది క్షీరాన్నంలోకి. తల్లీ, చెల్లాయి ఢిల్లీ భోగాలలో మట్టిబెడ్డలేరుతూ ముసిముసిగా నవ్వుకొంటున్నారు. సుశీల "ఏమిటేమిట"ని అడావుడి చెయ్యలేదు సరికదా, అసలు ఆమెలో చలనమే లేకపోయె.

ఇక లాభంలేదనుకుని "మీ ఆయన రేపొస్తున్నారేవ్" అని బైటపెట్టింది రామాయమ్మ.

"అదిగో చెప్పేసింది" అని కలకండ తల్లిని గుంజి గుంజి వదిలిపెట్టింది.

సుశీల పొంగిపోయింది లోలోపల. కాని అంతలో అణుచుకొని ఏమీ పట్టించుకోనట్టు, "కిస్‌మిస్ పళ్ళెక్కడున్నాయే అమ్మా!" అని అలమర దగ్గరకు వెళ్ళింది. చూపించేందుకు కలకండ కూడా వచ్చింది. ఎదురుగా అవుపిస్తున్న సీసాకోసం తెగవెతుకుతూ "వుత్తరమేదే!" అని చల్లగా అడిగింది సుశీల. "నేనివ్వను పో" అని విదిలించింది కలకండ. ఉత్తరాల వూచదగ్గరకు దారితీసింది

సుశీల. "అందులో యేముందీ - రేపు మెయిలులో వస్తున్నానని వ్రాశారు ముక్కసరిగా - అంతే" అని సరిపెట్టింది కలకండ.

"అదికాదే - నీ తలకాయ - ఏమి ప్రెజెంట్లు తెస్తున్నారూ అని".

ఉత్తరం చదువుకున్నది సుశీల, చెల్లాయి మాట నిజమే. ప్రెజెంటు సంగతి అసలు లేదు. "అంటే ఏ చిన్న రింగులోలకులో వస్తాయన్న మాట" అనుకున్నది స్వగతంగా. ఒక్క క్షణం చిన్నబుచ్చుకున్నది కానీ అంతలో వుత్తేజం పొందింది. "పోనీలే - అమ్మ వుబలాటం తీరింది ఇన్నాళ్ళకు - ఏనాడు సంక్రాంతికి వచ్చారుగనకా!" అని నిట్టూర్చింది సుశీల - ఆయన వస్తున్నాడన్న వుబలాటంలో తనకు భాగం లేనట్టు.

"అమ్మా! విన్నావుటే, నాకటా మొగుడు రాకపోయినా పెద్ద ప్రెజెంటు మాత్రం వస్తుంది టేవ్!"

"ఎవరంటా?"

"గడుగ్గాయి చంద్రకళ - పైగానటా, ఇందాక సువర్ణ మొగుడు తెచ్చిన గాజుల జత చూపించిందిలే ఖరీదెంతే... అని యధాలాభంగా అడిగితేనూ... చవకబారువని కించపరచడానికి ఆరాతీశానని దులిపింది స్మీ నన్ను."

"దాని కెవరు మాట్లాడినా తన పేదరికాన్ని వేలుతో చూపిస్తున్నా రనుకుంటుంది. అదో జబ్బు వీళ్లకు. అయినా నువ్వు ఆ ప్రశ్న వెయ్యకూడదమ్మా!"

"అది తక్కువ ప్రెజెంటన్న స్ఫురణే లేదమ్మా నాకు. ఊరికినే చటుక్కున వచ్చేసింది ఆ మాట."

"అంతే అనుకో 'సింపుల్‌గా బావుంది' అనెయ్యాలిసింది. కాని పేదరికమున్నది చూశావూ... అది మహా చెడ్డది. పైవాళ్ల కేదో వున్నదన్న ఏడుపు అట్టడుగున వుండి పనిచేస్తో వుంటుంది. మాటలో మనమేమాత్రం సందిచ్చినా... 'వున్నదని మిడిసిపోతున్నారు మహా' అని విరుచుకుని మీద పడతారు. సరేకాని మాటలసందున క్షీరాన్నంలోకి ఏలకుల పొడి మరిచి పోయానమ్మాయి చూడుచూడు" అని ఇంత చీకటిగా వున్నదేమా అని చావిడిలోకి వెళ్లింది. బైట మబ్బులేస్తున్నాయ్ "చెల్లాయి, లైటు వెలిగించమ్మా! అని కేకేసి సుశీలకూడా బైటకు వెళ్లి చూసింది, నల్ల కారుమబ్బులు దొంతరలుగా పిటపిటలాడుతున్నాయి ఆకాశంమీద. పట్టపగలు లైటు వెలిగించాల్సి వచ్చింది. వర్షం జల్లుగా మొదలై జడి వానగా మారింది. ధనుర్మాసంలో యీా అకాల వర్షాలేమిటా అని పెరట్లో తులసికోటలో నీళ్లుపోస్తూ రామాయమ్మ పరధ్యాన్నంగా వుంది.

"ఒసేవ్ జడ వేస్తా రావే" అని కలకండను దగ్గరకు తీసుకుంది సుశీల. "రెండు జడలు వెయ్యవుటే నాకు" అని గోముగా అంది చెల్లాయి. పాయలు తీస్తూ రహస్యంగా "ఈ సంగతి ఎవరితోనూ చెప్పకు స్మీ... అందరూనే, బావ రారని అనుకుంటున్నారు." అని నొక్కి చెప్పింది సుశీల. కలకండ కిక్కురుమనలేదు. "చెబితివా గిద్దెడు చమురొచ్చేలా మొదతా తెలిసిందా?"

అని జుట్టు ఒడిసిపట్టుకుని దాని తల తన వేపుకు తిప్పుకుని కళ్ళల్లోకి చూసింది. ఆమెకు తెలుసు–అదప్పుడే టపా భుజాన వేసుకుని బట్వాడాకు సిద్ధమవుతోంది. కలకండ బుంగమూతి పెట్టి "ఓ పిసరు చెప్పేశానేవ్ అక్కా!" అన్నది వోరగా చూస్తూ. "ఓసి నీ దుంప తెగా, అప్పుడే ఎవరి చెవికొరికావే?" అని గద్దించింది సుశీల. "మరే – మరే ఆదెమ్మ పిన్నిగా రింటిదగ్గర్నుంచి 'సినీబకెట్' పువ్వులు కోస్తుంటేనూ "మీ యింటికి పోస్టు జవానొచ్చాడు... ఎక్కణ్ణించి వచ్చిందే వుత్తరమూ?" అని అడిగింది చంద్రకళ. 'మా బావ దగ్గర్నుంచీ' అనేసి, ఆ పళంగా పరుగెత్తుకుని వచ్చేశా" అన్నది కలకండ. సుశీల ఆలోచించింది. రెండు జడలలోనూ రెండు పూటచెండ్లూ గుచ్చి "చంప పిన్ను లెందుకూ – డబ్బీలో పడెయ్యమ్మా!" అని కంఠస్వరం తగ్గించి. "చెల్లాయ్ ఇటు చూడమ్మా – ఈసా రడిగితేనే – ఏదో పెద్ద పేకటు! వచ్చిందని చెప్పేసేయ్ – తెలిసిందా?" అని పాఠం చెప్పింది సుశీల. "ఓ" అని తల వూపింది కలకండ; ఊపి, "అమ్మయ్యో! ఇంకానయం బావ దగ్గర్నుంచి ఏ మొచ్చిందో చెప్పలేదింకా" అని ఓ ఆపత్తు తప్పించినట్టు సీరియస్‌గా మొహం పెట్టింది. జడలువేసి "పో... పోయి స్నో పట్టుకురా" అని పంపింది.

స్నోబాటి లందిస్తూ "అక్కాయ్! నిన్ననే – రేడియోలో – చెప్పారుటేవ్; ఇవాళా – మన వేపుటా, పేద్ద గాలివాన కురుస్తుందిటేవ్" అన్నది కలకండ. సుశీల ముఖబింబంమీద చిన్న మబ్బొకటి మురిసింది. పెరట్లోకి వెళ్లి పైకి చూసింది.

"మీ ఆయన వస్తూ తడిసిపోతాడేమోనే!" అని రామాయమ్మ కూతుర్ని లోపలికి పిలిచింది.

కాని వాన తగ్గలేదు. ... ధారాపాతంగా వర్షం కురిసింది. తెల్లవారింది. కాని వాన తగ్గలేదు. మధ్యాహ్నానికి చిలికి చిలికి గాలివానయింది. ఊరి చివర చెరువు గండిపడింది. పేర్చిన పనలు దెబ్బతిన్నయ్యేమోనని ఆలస్యంగా కోసినందుకు నొచ్చుకుంటూ పాలేళ్ళు తొందరపడుతున్నారు. వాననీళ్ళు కాలవలు కట్టాయి. పిల్లకాయలు కాయితం పడవలతో వాన దేవునికి వీడ్కోలిస్తున్నారు. అందరి మొహాలు వికసించినై. పండగ సరదా చెడేలావుందని ఊహించారు అంతా. పంటకాలవ డాము దగ్గర బురద పాములమీద రాళ్ళు రువ్వుతున్నారు ఆకతాయిలు.

పంచాయతీబోర్డు ఆఫీసు నుండి రేడియో అరుస్తోంది. తెల్లారగట్ట ఏదో స్టేషను కవతల ఓ వంతెన కూలి మెయిలు ప్రమాదం జరిగిందనీ, అందులో సెకండ్‌క్లాస్ పెట్టె నదిలో జామ్మయి పోయిందనీ అందరికీ స్పష్టంగా వీధులలో వంగి పెద్దపెద్ద ముగ్గులు పెడుతున్న ముత్తైదులంతా లేచి అటు తేరి చూచారు. పాచిమనిషికి ఉలవపిండి రాతిగాబులో కలపమని పురమాయిస్తూ రామాయమ్మ గతుక్కుమని ఆదరాబాదరా లోపలికి పరిగెత్తింది. సుశీల దోమతెరలో ఇటాలియన్ రగ్గు మడతలకింద చదువుకొంటోంది.

"చూడమ్మాయీ! అల్లుడుగారు మెయిల్లోకదూ వస్తానని రాస్తా?" అని గాబరాగా అడిగింది తల్లి. అవునని తేలింది. రామాయమ్మ గుండెల్లో రాయి పడింది.

"ఏమిటమ్మా ఖంగారు?" అని మంచం దిగింది సుశీల. "కొంప మునిగిందే తల్లీ!"

అని రేడియో వార్త వినిపించింది. సుశీల దిగాలుపడిపోయింది.

నలుగురూ చేరారు. ఊరంతా గుప్పుమంది. మెయిల్లో రావలసిన సుశీల పెనిమిటి ఇంకా రాలేదు. ఆయన సెకండు క్లాసులోనేగాని ప్రయాణం చెయ్యడు. అది లోపల పనిచేస్తూంది సుశీలకు. ఆమె మొహాన్న కత్తివాటుకైనా నెత్తురుచుక్క లేదు. మనస్సు పరిపరివిధాల పోయింది. తలా ఒక మాటా అంటున్నారు. "ఖంగారుపడకమ్మా!" అని కొందరూ, "ఏమో!" అని చప్పరిస్తూ కొందరూ... కళవళపాటు తప్ప కర్తవ్యమెవ్వరికీ తోచలేదు.

"భగవంతుడు దీనికి ఏ శిక్ష వెయ్యబోతున్నాడో" అని రామాయమ్మ కుములుతోంది. సుశీల ఒంటరిగా గదిలో కూర్చొని పైటకొంగు నోట్లో కుక్కుకొని కన్నీరు మున్నీరయి వాపోతోంది.

"అఘాయిత్యం కాకపోతే ఈ అకాల వర్షాలేమిటమ్మా!" అని విస్తుపోయిందొక పడుచు. "ఈ కాలం పిల్లలు మరీ విడ్డూరం లేస్తూ - ఓ తిథి చూడరు - వారం చూడరు - శకునం చూడరు. పండుగనాడే దిగాలీ?" అని మూతివిరిచింది నంబినాంచారమ్మ. "ఇవేమి రైళ్ళోనమ్మా! ఇంత భోరున వాన కురుస్తుంటే, కాస్సేపు ఆగితే ఏమి పుట్టి మునిగిందో!" అన్నదొక శతవృద్ధు. కలకండ కంతా అయోమయంగా వుంది.

జోగన్నపంతులు వూళ్ళో మోతుబరి. సంగతి వివరంగా తెలుసుకున్నాడు. ఎవ్వరినీ గోల చెయ్యొద్దన్నారు. "స్టేషను వూరికి నాలుగు మైళ్ళే గదా. ఆరాలు తీద్దాం ముందు" అనేసి, నలుగుర్నీ పురమాయించి బళ్ళు కట్టించి బయల్దేరదీశాడు. "ఇల్లు జాగర్త"అని గోడలకు కళ్ళప్ప గించి సుశీలా, రామాయమ్మా, కలకండా బండి ఎక్కారు. ఇంకా వూళ్ళో పిన్నా పెద్దా అంతా పయనమయ్యారు.

సువర్ణా, చంద్రకళా క్రితంరోజు మధ్యాహ్నమే దగ్గర్లో వాళ్ల పినతల్లిగారింటికి వెళ్లారు. పండుగనాడు వచ్చేద్దామని.

బళ్లు వూరుదాటినై. స్టేషన్లో వాకబుచేసారు. ఏమీ తేలలేదు. సెకండుక్లాసు పెట్టె ఒకటి జామ్మయి పోయిందని తప్ప మరి తబిశీళ్లు లేవు. "ఆ రైలుకు సెకండుక్లాసు పెట్టెలెన్ని వున్నాయి" అనడిగింది రామాయమ్మ. ఒక్కటేనన్నారు. సుశీల నోట మాట లేదు. ఆయన సెకండు క్లాసులోనే గాని ప్రయాణం చెయ్యడు.

బళ్లు తిరుగుమొహం పట్టినై. టెలిగ్రాములు వెళ్లవు. ప్రమాదం జరిగిన చోటుకి రైళ్లు నడవడంలేదు. వీధులలో ముగ్గులన్నీ చెరిగి పోయినై.

దగ్గర వూళ్లో నాగన్నపంతులు తోబుట్టువుగారింట చిన్న కారుంది. మనిషిని పంపించాడు తీసుకు రమ్మనమని, 'ఇంకో కారుకూడా దొరికితే బావుణ్ణు' అనుకొని ఆ సన్నాహంలో ఉన్నాడు. "ప్రమాదం జరిగినచోటు మహావుంటే యిరవై మైళ్లుండేను. రెండు గంటలలో చేరుకోవచ్చును. మీరేం కంగారు పడకండి" అని ధైర్యం చెప్పాడు.

బళ్లు దిగారు సుశీల భారంగా యింటోకి వెళ్లింది. లోపల అగ్నిపర్వతం పేలడానికి

సిద్ధంగా ఉంది. "మొగుడు రాకపోయినా రాజాలాంటి ప్రెజెంటు కొడతావు" అని చంద్రకళ విసిరిన మాటలు గింగురుమని మోగుతున్నాయి చెవిలో, అవమానభారంతో క్రుంగిపోయి నడుస్తోంది. రామాయమ్మ పెరట్లో గోవిందుని చివాట్లువేస్తోంది. "తలపులన్నీ తెరిచి ఎక్కడికి పోయావురా?" అని.

సుశీల గదిలో అడుగుపెట్టింది. గప్పున ఆగిపోయింది. ఊళ్లో భోగిమంటల శోభంతా ఆమె మొహమ్మీదనే జిగ్గుమని వెలిగిందొక్కసారి. పట్టెమంచంమీద ఠీవిగా పడుకుని ఇంగ్లీషు నవల చదువుకుంటున్నాడు భర్త రాజారాం. తన కళ్లను తాను నమ్మలేదు సుశీల. ఆపళంగా బావురుమని అతని కాళ్లమీద కుప్పగూలిపోయింది. అతను లేచి నుంచున్నాడు. "ఇందాకటి నుంచీ నరకంలో వున్నామనుకోండి" అన్నది గద్గదికంగా.

"దిగు దిగు భూలోకానికి" అని లేవనెత్తి తలనిమిరి హాస్యంగా కళ్లల్లోకి చూచాడు రాజారాం.

"అంతా విన్నాలే. వొట్టి బెదురుగొడ్లు వూరు వూరంతా" అని మెదలకుండా వూరుకున్నాడు. సుశీల కొంచెం తేరుకుంది.

"నీకు పెద్ద ప్రెజెంటుకొన్నాను సీ" అని బెల్లించబోయాడు. "దిక్కుమాలిన ప్రెజెంటు పోనిస్తురూ... నాదేవుడు మళ్ళీ నాకవుపించాడీవేళ. అంతే చాలు" అని తడిసిన చెంపలు తడిసినట్టే పెకెత్తింది సుశీల.

"అసలు ఆ రెండోక్లాసు పెట్టెలో నే నొక్కణ్ణే అఘోరించాను. నేను గాక ఇంకెవళ్ళున్నా అన్ని మంగళసూత్రాలూ పుటుక్కున తెగేవే నిన్న."

"మరి మీరు?"

"నేను సరిగ్గా ఆవెనకాల స్టేషన్లోనే మా రామేశాన్ని పలకరిద్దామని ఫస్టుక్లాసు కంపార్టు మెంటులోకి వెళ్ళాను."

"అమ్మయ్య... రామేశం గారెవరండీ?"

"వాడూ నేనూ విజయనగరం కాలేజీలో కలిసి చదువుకొన్నాంలే. వాడు సబ్‌జడ్జి అయ్యాడు పుటుక్కున. మనం వ్యాపారంలో పడ్డామనుకో... వాడు నాకు ప్రాణంపోస్తా నిన్న. ప్లాట్‌ఫారంమీద "ఒహొూ" అంటే "ఒహొూ" అనుకున్న తరవాత తన కంపార్టుమెంటులోకి రమ్మనమని వాడూ, నా కంపార్ట్‌మెంటులోకి రమ్మనమని నేనూ మహా పెనుగులాడాము".

"ఇంకా నయం" సుశీల ఆశ్చర్యంగా వింటోంది తన అదృష్టగాథ".

"ఆఖరికి సిగ్గువిడిచి బండి కదిలేముందు చెప్పేశానుకూడా 'ఒక విలువైన నెక్‌లెస్ మా ఆవిడకని సంక్రాంతి కానుకగా కొన్నాను. అది బండిలో వుంది. ఎవడైనా కొట్టేస్తాడేమోనని'. వాడు "సరే" అనబోయాడు. రైలు కదిలిందంతే. పది నిమిషాలకి వంతెన కూలి నేను వదిలిన ఖాళీ సెకండ్ క్లాస్ పెట్టె అప్పడమయిపోయింది. ఆ అప్పడం పొరలలో హత్తుకుపోయింది నీ

ప్రెజెంటు" అని నవ్వుతాలు ముగించాడు రాజారాం.

"అమ్మయ్యా" అని గుండెలమీద చెయ్యివేసుకొన్నది సుశీల. "దిక్కుమాలిన ప్రెజెంటు నా కొంప ముంచేదే ఈవాళ... అయినా ఇహ నుంచీ నాకు ప్రెజెంట్లే వద్దు... తెలిసిందా" అని చెదిరిన క్రాఫ్ సరిచేసింది సుశీల.

"ఓసి పిచ్చిదానా! సమన్లు జారీఅయితే ఎక్కడున్నా వెదుక్కుంటో వస్తాడు అమీనా... లంచాలిచ్చి తిరగ్గొట్టేందుకు వీలులేని సమన్లవి. ఎక్కడున్నా తప్పవు."

మరి అక్కణ్ణించి ఎట్లా వచ్చిందీ అడగనేలేదు సుశీల. మబ్బుల్లోంచి ఇంట్లోకి నడిచి వచ్చాడా అనిపించిందాయెను.

చిన్నకారు దొరకలేదని, మనిషే తిరిగివచ్చాడు. ఏకార్లో వెదుకుదామని సన్నాహంలో వున్నారో ఆ కార్లోనే వచ్చానన్నాడు రాజారాం.

"అక్కాయ్" అని పిలిచింది కలకండ. విడిపించుకుని గబగబా కళ్ళు తుడిచేసుకుని బైటకు వెళ్ళిపోయింది సుశీల ఏమీ ఎరగనట్టు. బైటనే నిల్చుని వింటోంది రామాయమ్మ. ఇద్దరూ నవ్వుకున్నారు. సుశీల మొగుడొచ్చాడని ఈ వీధి నుంచి, ఈ ఇంటినించి ఆ ఇంటికీ ఆనోటా ఆనోటా సరఫరా అవుతోంది సువార్త.

పీటలకింద అమర్చాలిసిన ఆముదాల గింజలూ, తాంబూలంలోకి ఇమడ్చవలసిన పెండల పాకులూ పోగుచేస్తున్న కలకండకు వాకిట్లో బండి ఆగిన చప్పుడయింది. "అక్కాయ్, సువర్ణక్కాయ్ వస్తోందేవ్" అని కేకవేసింది.

సువర్ణా, చంద్రకళా బండి దిగారు. పినతల్లిగారింటి దగ్గర్నించి తిరిగి వస్తున్నారు గావును అనుకుంది సుశీల. రామాయమ్మగారి ఇల్లు వూరి చివర వుంది. బండి ఇంకా వూరి నడిబొడ్డు తొక్కలేదు. అంచేత వాళ్ళకింకా వూరంతా పడిన గగ్గోలు తెలియదు. బిలబిలా వచ్చారిద్దరూనూ. బండి దిగగానే ఇద్దరూ ఇంట్లో జొరబడి "నీ ప్రెజెంటు చూపించూ పోతాం" అని సుశీలమీద దండయాత్ర సాగించారు. వరండాలో సిరిచాప వేసింది సుశీల.

"ప్రెజెంటేమిటీ మీ తలకాయ"

"ఓసి నీ రహస్యం దొంగలు దోలా, చూపుతావా చూపవా?" అని దిమాకీ చేసింది సువర్ణ.

"పెద్దపేకట్టు వచ్చిందని చెప్పిందిలే కలకండ – అట్టే తెగనీలగకు" అని చెవిలో వూదింది చంద్రకళ.

"నేను చూపను – ఈయేడు నాకు వచ్చిన ప్రెజెంటు అపురూపమయింది – తెలుసా?" అని వూరించింది సుశీల.

"ఓసి నీ సిగ్గు చిమడా ప్రతి యేటా 'ఇదిగో' 'యిదిగో' అని చొంగలు కారుస్తూ

చూపేదానవు ఇవాళ యేమొచ్చింది?" అని ఆరా కోసం సువర్ణవంక చూసింది చంద్రకళ.

"చూస్తే మీ కళ్ళు జిగ్గుమంటాయి."

"కళ్ళు మూసుకుని చూస్తాలే అయితే" పకపక నవ్వుకున్నారు.

కలకండకు వుండబట్టడంలేదు. సుశీల కళ్ళతో గదమాయించింది.

"చూశావుటే సువర్ణా – మనమంటే దద్దమ్మలం! – అడక్కుండానే 'ఇదిగో'నని తెల్లమొహాలల్లే వూరుతో తీసుకొచ్చి చూపుతాం. అది చూడు ఎంత దాచుకుంటోందోయ"

"అబ్బబ్బ... అస్తారుపదంగా దాచుకుందామంటే సాగనీరుకదా" అని సుశీల గదిలోకి వెళ్ళింది. పేపర్లో మునిగిపోయి వున్నాడాయన. "ఏమండీ" అని పలకరించింది సుశీల. "ఒక్కసారి ఇట్లా రారూ" – పసిగట్టాడాయన – "అవ్వ" అని నోరునొక్కుకున్నాడు. "ఏమిటే హాస్యం – నన్ను అల్లరి చెయ్యదలచుకున్నావా?" "అబ్బ రండీ" అని రెండుచేతులా గుంజి గుమ్మంలోకి తీసుకొచ్చి నిలబెట్టి "ఇదిగో, ఈయేదు నా సంక్రాంతి కాన్క" అని గర్వంగా చూపింది సుశీల. అంత మనిషీ సిగ్గున విడిపించుకొని గదిలోకి పరుగెత్తాడు రాజారాం. వాళ్ళిద్దరికీ సిగ్గేసి గబగబా లేచి వంటింట్లోకి నడిచారు.

●●●●●